క్లుప్తంగా

'తూర్పు' అభ్యర్థుల వ్యయ పరిశీలన



ఎమ్మెల్యే అభ్యర్థుల వ్యయ రికార్డులు పరిశీలిస్తున్న సౌమ్య పాండే జైన్

ఆరిలోవ: తూర్పు నియోజకవర్గంలో బరిలో నిలిచిన ఎమ్మెల్యే అభ్యర్థులు ఇంత వరకు చేసిన ఖర్చులను గురువారం ఎన్నికల వ్యయ పరిశీలకులు పరిశీలించారు. ఎన్నికల వ్యయ పరిశీలకురాలు సౌమ్యపాండే జైన్ నియోజకవర్గం రిటర్నింగ్ అధికారి, జేసీ మయూర్ అశోక్‌తో కలిసి జీవీఎంసీ నాలుగో కార్యాలయం సమావేశ మందిరంలో 8 మంది అభ్యర్థుల ఖర్చులకు సంబంధించిన రికార్డులు తనిఖీ చేశారు. ఈ సమావేశానికి పోటీలో ఉన్న అభ్యర్థులు, వారి ప్రతినిధులు ఎన్నికల ఖర్చులకు సంబంధించి రికార్డులతో హాజరయ్యారు. ఇంత వరకు ఖర్చు చేసిన బిల్లులు, వారి నిర్వహణ రిజిస్టర్లను సౌమ్యపాండే జైన్‌కు అందజేశారు. ఆమె వాటిని క్షుణ్ణంగా పరిశీలించి తగిన సూచనలు చేశారు.

ఆదరించాలని స్వతంత్ర అభ్యర్థి ఆదాడ విజ్ఞప్తి



మాట్లాడుతున్న స్వతంత్ర అభ్యర్థి ఆదాడ రమణి

ఆరిలోవ: తూర్పు నియోజకవర్గంలో స్వతంత్ర అభ్యర్థిగా పోటీ చేస్తున్న తనను ఆదరించాలని ఆదాడ రమణి కోరారు. ఆమె ఆరిలోవలో గురువారం విలేకరులతో మాట్లాడారు. తూర్పు నియోజకవర్గం ఎమ్మెల్యేగా తనకు ఒక్క అవకాశం ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు. కాంగ్రెస్‌లో తగిన ప్రాధాన్యత ఇవ్వకపోవడంతో స్వతంత్ర అభ్యర్థిగా బరిలో నిలిచినట్టు ఆమె తెలిపారు.

డాక్టర్ కూటికుప్పల సూర్యారావుకు దాసరి ఫిల్మ్ అవార్డు



వెంకయ్యనాయుడు చేతుల మీదుగా అవార్డు అందుకుంటున్న కూటికుప్పల

కంచరపాలెం: వైద్య రంగంలో విశేష సేవలందించిన 'పద్మశ్రీ' డాక్టర్ కూటికుప్పల సూర్యా రావును దాసరి ఫిల్మ్ అవార్డు వరించింది. హైదరాబాద్ ప్రసాద్ ల్యాబ్స్‌లో బుధవారం జరిగిన కార్యక్రమంలో మాజీ ఉప రాష్ట్రపతి ఎం.వెంకయ్యనాయుడు చేతుల మీదుగా ఆయన ఈ అవార్డును అందుకున్నారు. ప్రతి ఏడాది నిర్వహించే దాసరి జీవన సాఫల్య పురస్కార ప్రదానోత్సవంలో భాగంగా దాసరి ఫిల్మ్ అవార్డును అందుకోవడం ఎంతో ఆనందంగా ఉందని డాక్టర్ కూటికుప్పల సూర్యారావు అన్నారు.

సిరులతల్లికి పంచామృతాభిషేకం



కనకమహాలక్ష్మి

డాబాగార్డెన్స్ : బురుజుపేటలో వెలసిన కనకమహాలక్ష్మి దేవస్థానంలో గురువారం త్రికాల పంచామృతాభిషేకం జరిపారు. ఈ సేవలో పలువురు ఉభయదాతలు పాల్గొన్నారు. ఈ పూజలో పాల్గొనదలిచే భక్తులు రూ.1,000 పూజా రుసుం చెల్లించి పాల్గొనవచ్చు. ఈ ప్రత్యేక పూజను పరోక్ష పద్ధతిలో చేసుకునే ఆసక్తి గల భక్తులు యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, టౌన్‌కొత్తరోడ్డు బ్రాంచ్, అకౌంట్ నంబరు 060810011006691, ఐఎఫ్‌ఎస్‌సీ కోడ్ యూబీఐఎన్ 0806081లో చెల్లించవచ్చు. కార్యక్రమంలో ఆలయ ఈవో శ్రీనివాసులరెడ్డి, ఏఈవోలు తిరుమలేశ్వరరావు పాల్గొన్నారు.

వెలగపూడీలా

- తూర్పులో టీడీపీని వెంటాడుతున్న ఓటమి భయం
- ఫుల్‌జోష్‌తో వైఎస్సార్‌సీపీ

ఆరిలోవ: తూర్పు నియోజకవర్గంలో టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి వెలగపూడి రామకృష్ణబాబు పరిస్థితి అగమ్యగోచరంగా తయారైంది. అన్ని రకాల ప్రతికూల పరిస్థితులు ఆయన చుట్టూ చేరి ఓటమికి దారి చూపుతున్నాయి. వెలగపూడి అనుకున్నదొక్కటి.. జరుగుతున్నది మరోలా ఉండడంతో ఈసారి ఓటమి తప్పదన్న సంకేతాలతో ఉక్కిరిబిక్కిరి అవుతున్నారు. మరో వైపు నియోజకవర్గంలో వైఎస్సార్‌సీపీ బలం రోజురోజుకు పెరుగుతుండడంతో వెలగపూడికి మింగుడు పడడం లేదు. రోజురోజుకూ టీడీపీ గ్రాఫ్ తగ్గిపోతుందని వెలగపూడి వాపోతున్నట్టు ఆ పార్టీ నాయకులు చెబుతున్నారు. ఇటీవల వైఎస్సార్‌సీపీలో పదవులు అనుభవించి టీడీపీలో చేరిన అక్కరమాని దంపతుల వ్యవహారం ఆయనకు మరింత తలనొప్పిగా మారిందట. నాలుగోసారి బరిలో దిగుతున్న తనకు అక్కరమాని రూపంలో గండిపడబోతుందనే సంకేతాలు ఆయనకు మింగుడుపడటంలేదట. ఇప్పుడు ఏం చేయాలో తెలియక ఆ పార్టీ నాయకుల వద్ద తలపట్టుకుని మదనపడుతున్నారని తెలిసింది.

వెలగపూడి ఓటమి భయానికి కారణాలు

➡ నియోజకవర్గంలో అన్ని వార్డుల నుంచి వైఎస్సార్‌సీపీలోకి చేరికలు జోరుగా సాగుతున్నాయి. ఆ పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థి ఎంవీవీ సత్యనారాయణ సమక్షంలో రోజూ ఇతర పార్టీలకు చెందిన కార్యకర్తలు, నాయకులు వైఎస్సార్‌సీపీ తీర్థం పుచ్చుకుంటున్నారు. ఆరిలోవ, ఆదర్శనగర్, పెదజాలరిపేట, ఇసుకతోట, పిఠాపురం కాలనీ, అప్పుఘర్, హెచ్‌బీకాలనీ, తదితర ప్రాంతాల నుంచి టీడీపీ, జనసేన, కాంగ్రెస్ పార్టీలకు చెందిన నాయకులు, కార్యకర్తలు ఇటీవల పెద్ద సంఖ్యలో వైఎస్సార్‌సీపీలో చేరారు.

➡ ప్రచారంలో కూడా వైఎస్సార్‌సీపీ దూసుకుపోతోంది. వార్డుల్లో ఇంటింటికి వెళ్లి ఫ్యాన్ గుర్తుపై ఓటు వేయాలని ఆ పార్టీ శ్రేణులు విస్తృత ప్రచారం చేస్తున్నారు. టీడీపీ మాత్రం ప్రచారంలో ఒంటరైంది. జనసేన, బీజేపీ నాయకులు కలిసిరావడం లేదు. మరో వైపు టీడీపీలో వర్గపోరుతో ఆ పార్టీ ప్రచారంలో కార్యకర్తలు అంతంత మాత్రంగా కనిపిస్తున్నారు.

➡ టీడీపీ అభ్యర్థిగా వెలగపూడి గత నెల 19న నామినేషన్ వేశారు. వైఎస్సార్‌సీపీ అభ్యర్థిగా ఎంవీవీ సత్యనారాయణ గత నెల 24న నామినేషన్ వేశారు. నామినేషన్ ర్యాలీలో టీడీపీని మించి వేల సంఖ్యలో వైఎస్సార్‌సీపీ కార్యకర్తలు పాల్గొని విజయవంతం చేశారు. ఆ ర్యాలీతో నియోజకవర్గంలో వైఎస్సార్‌సీపీ బలం పెరిగిందంటూ టీడీపీ నాయకులే బాహాటంగా చెప్పుకుంటున్నారు.



➡ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పక్కాగా అమలు చేస్తున్న సంక్షేమ పథకాల గురించి ఆ పార్టీ కార్యకర్తలు పూర్తి స్థాయిలో ప్రజల్లోకి తీసుకెళ్లగలిగారు. ఇది ఆ పార్టీకి సానుకూలంగా మారింది. మరో వైపు టీడీపీ ఎన్నికల మేనిఫెస్టోపై జనం పెదవి విరుస్తుండడంతో వెలగపూడికి ఏం చేయాలో పాలుపోవడం లేదని చెబుతున్నారు. ఇబ్బడిముబ్బడిగా ఎన్ని హామీ ఇచ్చినా పార్టీ అధినేత చంద్రబాబుపై ప్రజల్లో నమ్మకం లేకపోవడంతో వ్యతిరేక పవనాలు వీస్తున్నాయని ఆ పార్టీ శ్రేణులు చర్చించుకుంటున్నాయి.

టీడీపీ నిర్వాకంతో పింఛన్‌దార్ల అవస్థలు

వృద్ధులు, దివ్యాంగులు, వితంతువులకు ఇంటికి వెళ్లి ఇచ్చే పింఛన్లను టీడీపీ నాయకులే నిలిపేశారన్న నిజం ప్రజల్లోకి బలంగా చేరింది. గత నెలలో సచివాలయాలకు వెళ్లి పింఛన్ డబ్బులు తీసుకోవడం, ఈ నెలలో అకౌంట్లలో జమ చేయడంతో బ్యాంకులకు వెళ్లి ఆ డబ్బులు తీసుకోవడానికి లబ్ధిదారులు నానా ఇబ్బందులు పడుతున్నారు. ఇదంతా టీడీపీ అధినేత చంద్రబాబే కోర్టులో కేసు వేసి చేశాడని, ఆయన వల్లే ఈ ఇబ్బందులు పడుతున్నామని ప్రజలు ఛీ కొడుతున్నారు.

అక్కరమానితో మరో తలనొప్పి

నియోజకవర్గంలో వైఎస్సార్‌సీపీ ఫుల్ జోష్ మీద ఉండడంతో ఏం చేయాలో దిక్కుతోచని స్థితిలో ఉన్న వెలగపూడికి.. అక్కరమాని రూపంలో మరో కొత్త తలనొప్పి తోడైందట. వైఎస్సార్‌సీపీలో అక్కరమాని వెంకటరావు, విజయనిర్మల ఉన్నప్పుడు ఆ పార్టీలోనే వారిపై వ్యతిరేకత పెరిగింది. అక్కరమానికి సన్నిహితులుగా ఉండేవారిని విభేదించలేక చాలా మంది టీడీపీకి సానుభూతిపరులుగా మారారు. అది టీడీపీ అభ్యర్థి వెలగపూడికి అనుకూలంగా మారింది. ఇటీవల అక్కరమాని దంపతులు టీడీపీలో చేరడంతో వాళ్ల కథ మళ్లీ మొదటికి వచ్చింది. దీంతో టీడీపీకి సానుకూలంగా మారినవారు, టీడీపీలో ఉంటూ అక్కరమానిని బలంగా వ్యతిరేకించిన వారంతా ఇప్పుడు ఒక్కొక్కరుగా వైఎస్సార్‌సీపీకి సానుభూతిపరులుగా మారిపోతున్నారు. దీంతో పాటు అక్కరమాని వైఎస్సార్‌సీపీలో ఉన్నప్పుడు తమ అనుచరులుగా ఉన్నవారిని కూడా టీడీపీలో చేరాలని ఒత్తిడి చేస్తున్నారు. వారు ససేమిరా అనడంతో వారికి వెలగపూడితో తాయిలాలు ఇప్పిస్తానని ఒప్పిస్తున్నారట. ఇలా రెండు రోజుల క్రితం ఆరిలోవలో ఓ వ్యక్తికి, అతనితో పాటు వచ్చిన సుమారు 10 మందికి రూ.5 లక్షలు ఇప్పిస్తానని హామీ ఇచ్చారట. దీంతో వారు పార్టీలో చేరారు. మరో వ్యక్తికి ఓ సంఘం భవనం నిర్మాణానికి వెలగపూడితో డబ్బులు ఇప్పిస్తానని హామీ ఇచ్చేశారట. దానికి ఆశపడిన ఆయన కూడా టీడీపీలో చేరిపోయారు. అలాంటి వారందరికీ డబ్బులు ఇస్తేపోతే అప్పులు చేయాల్సి ఉంటుందని వెలగపూడి అక్కరమాని గురించి టీడీపీ నాయకుల వద్ద రుసురుసలాడుతున్నారట. అక్కరమానితో ఇదేం తలనొప్పిరా బాబూ.. ఓ పక్క డబ్బులు పోతున్నాయి.. మరో పక్క ఉన్న ఓట్లు పోతున్నాయి అంటూ బాధపడుతున్నారని విశ్వసనీయ సమాచారం. వీళ్ల రాకతో ఉన్న ఓట్లు పోతున్నాయని, ఈ సారి ఓటమి తప్పేటట్లు లేదని టీడీపీకి నాయకుల వద్ద వెలగపూడి ఆందోళన వ్యక్తం చేసినట్టు సమాచారం.

యువత ఓటు హక్కు వినియోగించుకోవాలి



విశాలాక్షినగర్ బీవీకే కాలేజీలో అవగాహన కల్పిస్తున్న పీఆర్ఎస్ఐ ప్రతినిధులు

ఆరిలోవ: సాధారణ ఎన్నికల్లో యువత విధిగా తమ ఓటు హక్కును వినియోగించుకోవాలని ఏయూ పరీక్షా విభాగాల డీన్ ఆచార్య డి.వి.ఆర్. మూర్తి సూచించారు. భారత ప్రజా సంబంధాల సంఘం(పీఆర్ఎస్ఐ) ఆధ్వర్యంలో గురువారం విశాలాక్షినగర్‌లో బీవీకే జూనియర్ కళాశాల ఆవరణలో ఓటు హక్కు వినియోగంపై యువతకు అవగాహన కల్పించారు. బ్యానరు పట్టుకొని సమీపంలో అవగాహన ర్యాలీ చేపట్టారు. ఈ సందర్భంగా ఆచార్య మూర్తి మాట్లాడుతూ 1962లో 21.63 కోట్ల మంది భారతదేశంలో ఓటింగ్‌లో పాల్గొన్నారన్నారు. ఇప్పుడు ఆ సంఖ్య 94.5 కోట్లకు చేరిందన్నారు. ప్రజాస్వామ్య ప్రభుత్వంలో ఓటు వజ్రాయుధమన్నారు. సరైన పాలకులను ఎన్నుకోవడానికి యువత తప్పనిసరిగా ఓటు హక్కు వియోగించుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో పీఆర్ఎస్ఐ జాతీయ ప్రధాన కార్యదర్శి డాక్టర్ పి.ఎల్.కె.మూర్తి, దక్షిణ భారత ఉపాధ్యక్షుడు యు.ఎస్.శర్మ, విశాఖ అధ్యక్షుడు ఎం.కె.వి.ఎల్.నర్సింహం, బీవీకే ప్రిన్సిపాల్, సిబ్బంది పాల్గొన్నారు.

ఓటు హక్కు వినియోగంపై అవగాహన ర్యాలీ



ర్యాలీ నిర్వహిస్తున్న దివ్యాంగ విద్యార్థులు

ఎంవీపీ కాలనీ: రాజ్యాంగం కల్పించిన ఓటు హక్కును సమాజంలోని ప్రతి ఒక్కరూ వినియోగించుకోవాలని కోరుతూ హిడెన్ స్ప్రౌట్స్ మానసిక వికలాంగుల పాఠశాల విద్యార్థులు గురువారం ర్యాలీ నిర్వహించారు. ఎంవీపీ కాలనీ ఉషోదయ కూడలి దరి పాఠశాల సమీపంలో ఈ ర్యాలీ జరిగింది. ఓటు హక్కు ఉపయోగాలతో పాటు ఓటు వేయాల్సిన బాధ్యతను తెలియజేసేలా విద్యార్థులు ప్లకార్డులు ప్రదర్శించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్ కండిపిల్లి శ్రీనివాస్, సిబ్బంది పాల్గొన్నారు.

వైఎస్సార్‌సీపీ గెలుపు కోసం విశేష కృషి



మంత్రి బొత్స సత్యనారాయణతో కార్పొరేటర్ అప్పారి శ్రీవిద్య, గిరిబాబు

బీచ్ రోడ్డు: వైఎస్సార్‌సీపీ విజయమే లక్ష్యంగా ఇంటింటికీ వెళ్లి ప్రచారం చేస్తున్నామని మంత్రి బొత్స సత్యనారాయణకు జీవీఎంసీ 15వ వార్డు కార్పొరేటర్ అప్పారి శ్రీవిద్య, గిరిబాబు తెలిపారు. గురువారం సిరిపురంలో మంత్రి నివాసంలో కలిసి ప్రచారం వివరాలను తెలియజేశారు. పార్టీ మేనిఫెస్టోపై అవగాహన కల్పిస్తున్నామన్నారు. ఎంపీ అభ్యర్థిగా బొత్స ఝాన్సీలక్ష్మి, తూర్పు ఎమ్మెల్యే అభ్యర్థి ఎంవీవీ సత్యనారాయణకు ఓటు వేసి గెలిపించాలని ప్రజలను కోరుతున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా మంత్రి స్పందిస్తూ కష్టపడి పని చేసే వారికి పార్టీలో మంచి గుర్తింపు ఉంటుందన్నారు.

మామిడి పంటకు వేలం

ఆరిలోవ: విశాఖ కేంద్రం కారాగారంలో మామిడి తోట ఫల సాయానికి గురువారం వేలం నిర్వహించారు. ఇక్కడ జైలు బయట ఉన్న మామిడి చెట్ల పంట వేలం వేశారు. ఓ వ్యక్తి మామిడి పంటను రూ.80 వేలకు దక్కించుకున్నారు. ఇక్కడ ఆవులు, గేదెలకు చెందిన 16 దూడలను మరో వ్యక్తి రూ.లక్షకు దక్కించుకున్నట్లు జైలు అధికారులు తెలిపారు.

రెజ్యూమ్ ఆకర్షించేలా ఉండాలి



సదస్సులో పాల్గొన్న వగీర జొన్నాడ

ఏయూ క్యాంపస్ : రెజ్యూమ్ మార్కెట్లో ఉన్న ఉద్యోగ అవకాశాలకు అనుగుణంగా ఆకర్షించేలా తయారు చేసుకోవాలని రిసోర్స్ పర్సన్ వగీర జొన్నాడ తెలిపారు. గురువారం ఏయూ కామర్స్ అండ్ మేనేజ్‌మెంట్ స్టడీస్ విభాగంలో రెజ్యూమ్ బిల్డింగ్.. పర్సనాలిటీ డెవలప్‌మెంట్‌పై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వగీర మాట్లాడుతూ విద్యార్థులు ఉద్యోగావకాశాలు సాధించే క్రమంలో ప్రాథమికంగా రెజ్యూమ్ నిర్మాణం గురించి పూర్తిగా తెలుసుకోవాలన్నారు. రెజ్యూమ్ అనేది ఒక విద్యార్థి సామర్థ్యాలు, నైపుణ్యం, అర్హతలను, భవిష్యత్తు ప్రణాళికలను తెలియపరిచే అద్భుతమైన డాక్యుమెంట్ అని చెప్పారు. ఈ కార్యక్రమంలో విభాగం అధిపతి ప్రొఫెసర్ జాలాది రవి, అసిస్టెంట్ ప్రొఫెసర్ బోరుగడ్డ సుబ్బయ్య, తదితరులు పాల్గొన్నారు.

కష్టాలు ఎదుర్కొని ముందుకు సాగాలి



కరపత్రాలు ఆవిష్కరిస్తున్న రిజిస్ట్రార్ జేమ్స్ స్టీఫెన్

ఏయూ క్యాంపస్: కష్టాలను ఎదుర్కొని ధైర్యంతో ముందుకు సాగాలని ఏయూ రిజిస్ట్రార్ ఆచార్య జేమ్స్ స్టీఫెన్ అన్నారు. గురువారం ఏయూ రిజిస్ట్రార్ కార్యాలయంలో ఆరోగ్య మిత్ర స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో ఆత్మహత్య ల నివారణ కమిటీ రూపొందించిన కరపత్రాలను ఆయన ఆవిష్కరించారు. అనంతరం స్టీఫెన్ మాట్లాడుతూ ఆత్మహత్యలకు పాల్పడవద్దని, జీవితం ఎంతో విలువైనదని సూచించారు. ప్రతి ఒక్కరికీ మేము ఉన్నామంటూ భరోసానిస్తే ఆత్మహత్యలు తగ్గుతాయన్నారు. ఆరోగ్య మిత్ర స్వచ్ఛంద సంస్థ గత పదేళ్లలో 28 మందిని ఆత్మహత్య చేసుకోకుండా కాపాడడం అభినందనీయమన్నారు. ఈ కార్యక్రమంలో సంస్థ ప్రతినిధి డాక్టర్ పరికిపండ్ల అశోక్, తత్వశాస్త్ర విభాగాధిపతి వానపల్లి వెంకటరావు, తదితరులు పాల్గొన్నారు.

రోటరీ క్లబ్ వైజాగ్ కపుల్స్ దాతృత్వం



దుర్గారావుకు చెక్కు అందజేస్తున్న రోటరీ క్లబ్ వైజాగ్ కపుల్స్ ప్రతినిధులు

డాబాగార్డెన్స్ : రోటరీ క్లబ్ వైజాగ్ కపుల్స్ అంధుడికి అండగా నిలిచింది. నాలుగేళ్ల పాటు ఏయూలో లా చదివి పలువురికి స్ఫూర్తిగా నిలిచాడు లా విద్యార్థి దుర్గారావు. నాలుగేళ్ల అనంతరం తన కష్టాన్ని సర్టిఫికెట్ రూపంలో తీసుకుందామనుకుంటే ఏయూకి రూ.లక్షా 50 వేలు చెల్లించాల్సి వచ్చింది. ఈ విషయం తెలిసి రోటరీ క్లబ్ వైజాగ్ కపుల్స్ డైరెక్టర్లు ఆశ జాస్తి, కరుణ పెద్ద మనసుతో స్పందించారు. అధైర్యపడొద్దంటూ రూ.లక్షా 50 వేల చెక్కును దుర్గారావుకు అందజేశారు. ఈ కార్యక్రమంలో శ్రావణి, ఎస్. శివ, శోభన్, సుధ, ధర్మేంద్ర, ఆర్‌వీఎస్ రాజు పాల్గొన్నారు.

సత్యజిత్ రే చిత్రాలు ఆణిముత్యాలు



సత్యజిత్ రే చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న అడిషనల్ కమిషనర్ గోపీకృష్ణ తదితరులు

సీతంపేట: ఆస్కార్ అవార్డు గ్రహీత, భారతరత్న సత్యజిత్ రే సినిమా రంగంలో భారతదేశం గర్వించదగ్గ దర్శకుల్లో ఒకరని ఆదాయ పన్ను శాఖ అడిషనల్ కమిషనర్ గోపీకృష్ణ అన్నారు. వైజాగ్ ఫిల్మ్ సొసైటీ ఆధ్వర్యంలో గురువారం ద్వారకానగర్ పౌర గ్రంథాలయంలో సత్యజిత్ రే జయంతి వేడుకలు నిర్వహించారు. ఆయన చిత్రపటానికి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ముఖ్య అతిథి గోపీకృష్ణ మాట్లాడుతూ సత్యజిత్ రే తీసిన చిత్రాలు ఎప్పటికీ ఆణిముత్యాలుగా కీర్తి పొందాయన్నారు. ఆయన బెంగాలీలో చిత్రాలు తీసినప్పటికీ భాషా భేదం లేకుండా అందరికీ అర్థమవుతాయని చెప్పారు. భారతీయ చలనచిత్ర రంగానికి అంతర్జాతీయ గుర్తింపు తెచ్చి ఆస్కార్ అందుకున్న రే చిరస్మరణీయుడని కొనియాడారు. అనంతరం భారత ప్రభుత్వ ఫిల్మ్ డివిజన్ రూపొందించిన సత్యజిత్ రే డాక్యుమెంటరీని ప్రదర్శించారు. కార్యక్రమంలో నరవ ప్రకాశరావు, భరణికాన రామారావు, బర్మన్, ఎంవీవీ గుప్తా, చిన్నారావు, హుస్సేన్ తదితరులు పాల్గొన్నారు.

చెస్ శిక్షణకు స్పందన



చెస్ శిక్షణ శిబిరంలో విద్యార్థులు

మురళీనగర్: మురళీనగర్ వాకర్స్ క్లబ్ ఆధ్వర్యంలో స్థానిక వాకర్స్ పార్కులో వారం రోజులుగా నిర్వహిస్తున్న ఉచిత చెస్ శిక్షణ శిబిరానికి బాలబాలికల నుంచి విశేష స్పందన లభిస్తోంది. ప్రతి రోజు సాయంత్రం గంటన్నర పాటు జరుగుతున్న ఈ శిక్షణ కు 90 మంది విద్యార్థులు హాజరవుతున్నారు. శిక్షకుడు సనపల ఉమాపతి బాలబాలికలకు చెస్ క్రీడలోని ఎత్తులకు పైఎత్తులు వేయడంలో మెలకువల ను నేర్పిస్తున్నారు. దీనిపై విద్యార్థుల తల్లిదండ్రులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

సంక్షేమం చేరువై.. ఆనందం వెల్లువై..



17వ వార్డులో ప్రచారం నిర్వహిస్తున్న ఎమ్మెల్యే అభ్యర్థి ఎంవీవీ సత్యనారాయణ, కార్పొరేటర్ లావణ్య తదితరులు



కరపత్రాలు అందిస్తూ ప్రచారం చేస్తున్న 22వ వార్డు అధ్యక్షుడు పీతల గోవింద్



16వ వార్డు కేఆర్ఎం కాలనీలో మొల్లి అప్పారావు ప్రచారం

- హుషారుగా వైఎస్సార్‌సీపీ ఎన్నికల ప్రచారం
- ఇంటింటికీ వెళ్లి ఆప్యాయంగా పలకరించిన పార్టీ అభ్యర్థి ఎంవీవీ



10వ వార్డు డెయిరీ ఫారం జంక్షన్‌లో ర్యాలీ నిర్వహిస్తున్న వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి ఎంవీవీ సత్యనారాయణ



15వ వార్డు పాత వెంకోజీపాలెంలో ఎన్నికల ప్రచారం చేస్తున్న అప్పారి గిరిబాబు



20వ వార్డులో ప్రచారం చేస్తున్న వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు మద్ది పోలిరెడ్డి, తదితరులు



28వ వార్డు రామ్‌నగర్‌లో ఇంటింటికి ప్రచారం చేస్తున్న పల్లా దుర్గారావు



21వ వార్డులో ప్రచారం చేస్తున్న మధుపాడ రవికుమార్

ఆరిలోవ: తూర్పు నియోజకవర్గంలో రోజూ వైఎస్సార్‌సీపీ ఎన్నికల ప్రచారం జోరుగా సాగుతోంది. జీవీఎంసీ 10వ వార్డులో గురువారం పార్టీ కార్యకర్తలు, అభిమానులతో కలసి ఆ పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థి ఎంవీవీ సత్యనారాయణ ప్రచారం చేశారు. పార్టీ జెండాలు, ఫ్యాన్ గుర్తు ఆకారంలో బెలూన్లు పట్టుకొని కార్యకర్తలు వీధుల్లో ర్యాలీ చేపట్టారు. తోటగరువు వద్ద ప్రారంభమైన ఈ ప్రచారం బీఎస్ఆర్ నగర్, రవీంద్రనగర్, ఎస్‌బీజీ నగర్, వివేకానంద నగర్, సుందర్‌నగర్, ఆదర్శనగర్, డెయిరీ ఫారం వరకు సాగింది. ఇంటింటి వెళ్లి ప్రజలను ఎంవీవీ పలకరించారు. ఫ్యాన్ గుర్తుపై ఓటు వేసి తనను ఎమ్మెల్యేగా, బొత్స ఝాన్సీలక్ష్మిని ఎంపీగా గెలిపించాలని కోరారు. డెయిరీ ఫారం వద్ద తోపుడు బండిపై పండ్లు విక్రయించే ఓ మహిళను, ఆమె ఇద్దరు పిల్లల్ని పలకరించారు. వారు చదువు, ఆర్థిక పరిస్థితి గురించి ఆరా తీశారు. అమ్మఒడి, ఇతర సంక్షేమ పథకాల గురించి తెలుసుకున్నారు. కార్యక్రమంలో పార్టీ విద్యా విభాగం డైరెక్టర్ పతివాడ వెంకటలక్ష్మి, వైఎస్సార్‌సీపీ స్థానిక నాయకులు బొండా శ్రీనివాసరావు, పతివాడ కనకరాజు, వైదా నారాయణరావు, చలం, వరలక్ష్మి, మొల్లి వెంకటరమణ, పైడిరాజు, మొల్లి హేమంత్, తదితరులు పాల్గొన్నారు.

ఏయూ క్యాంపస్: వైఎస్సార్‌సీపీకి మద్దతుగా జీవీఎంసీ 22వ వార్డు అధ్యక్షుడు పీతల గోవింద్ విస్తృత ప్రచారం నిర్వహించారు. ప్రతి ఇంటికి వెళ్లి ప్రజలకు కరపత్రాలు అందజేసి వైఎస్సార్‌సీపీకి ఓటు వేయాలని కోరురు.

బీచ్ రోడ్డు: జీవీఎంసీ 15వ వార్డు పాత వెంకోజీపాలెంలోని 272, 273 బూత్‌లో వైఎస్సార్‌సీపీ వార్డు ఇన్‌చార్జి అప్పారి గిరిబాబు ప్రచారం నిర్వహించారు. ప్రతి ఇంటికి వెళ్లి ఈ ఐదేళ్లలో వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అందించిన సంక్షేమం పథకాలు, 2024 మేనిఫెస్టో గురించి ప్రజలకు వివరించారు. ఈ కార్యక్రమంలో పార్టీ వార్డు ప్రెసిడెంట్ పీలా వెంకట్, నరాల సత్తిబాబు, ఈశ్వరరావు, కృష్ణ, బొడ్డేటి రామకృష్ణ, పోల్‌రాజు, వీర్రాజు పాల్గొన్నారు.

➡ జీవీఎంసీ 16వ వార్డు కేఆర్ఎం కాలనీలో వైఎస్సార్‌సీపీ తూర్పు నియోజకవర్గం ఎన్నికల పరిశీలకుడు మొల్లి అప్పారావు ప్రతి ఇంటికీ వెళ్లి ఫ్యాన్ గుర్తుకు ఓటు వేసి మళ్లీ వైఎస్ జగన్ అధికారంలోకి వచ్చేలా కృషి చేయాలని కోరారు.

➡ జీవీఎంసీ 28వ వార్డు రామ్‌నగర్‌లో వైఎస్సార్‌సీపీ వార్డు ఇన్‌చార్జి పల్లా దుర్గారావు ఇంటింటికి వెళ్లి ఫ్యాన్ గుర్తుకు ఓటేయాలని కోరారు.

17వ వార్డులో..

ఎంవీపీ కాలనీ: విశాఖ ఎంపీ, వైఎస్సార్‌సీపీ తూర్పు నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థి ఎంవీవీ సత్యనారాయణ 101వ రోజు గురువారం 17వ వార్డు ఆదర్శనగర్‌లో పార్టీ శ్రేణులతో కలిసి ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఫ్యాన్ గుర్తుపై ఓటేసి తనను ఎమ్మెల్యేగా, బొత్స ఝాన్సీని ఎంపీగా గెలిపించాలని ఎంవీవీ కోరారు. ఈ కార్యక్రమంలో 17వ వార్డు కార్పొరేటర్ గేదెల లావణ్య, పార్టీ రాష్ట్ర కార్యదర్శి పీవీ నారాయణ, పార్టీ నాయకులు గేదెల నాగరాజు, సుబ్రహ్మణ్యం, సత్యవతి, నీలారెడ్డి, ప్రేమ్ కిరణ్, చంద్రిక పాల్గొన్నారు.

బీచ్ రోడ్డు: జీవీఎంసీ 20వ వార్డు పెదవాల్తేరులోని 158 పోలింగ్ బూత్ పరిధిలో వైఎస్సార్‌సీపీ వార్డు అధ్యక్షుడు మద్ది పోలిరెడ్డి, బి.రమాదేవి ఇంటింటి ప్రచారం చేశారు. ఫ్యాన్ గుర్తుపై ఓటేసి, వైఎస్సార్‌సీపీ అభ్యర్థులను గెలిపించాలని కోరారు.

➡ 21వ వార్డు చినవాల్తేరులోని రెల్లివీధిలో వైఎస్సార్‌సీపీ వార్డు అధ్యక్షుడు మధుపాడ రవికుమార్ ఎన్నికల ప్రచారం నిర్వహించారు.